జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 26 ఫిబ్రవరి 2024 www.ntnews.com


## బ్రాహ్మీముహూర్తం అంటే..

**బ్రాహ్మీముహూర్తం అంటే ఏమిటి? మంత్ర సాధనకు ఆ సమయం ప్రశస్తమైనదని చెబుతారు ఎందుకు?**

• శ్రీధర్, సిద్దిపేట

తెల్లవారుజామున 3 గంటల 20 నిమిషాల నుంచి 5 గంటల 40 నిమిషాల మధ్యకాలాన్ని బ్రాహ్మీముహూర్తం అంటారు. మనిషికి జ్ఞానాన్ని అందించే అద్భుతకాలం బ్రాహ్మీముహూర్తం. సాధారణంగా ప్రతిగంటకు గ్రహహోర మారుతుంది. అంటే క్షితిజ రేఖ దగ్గర ఆ గ్రహం కనిపిస్తుందని అర్థం. హోరాకాలానికి అధిదేవత అయిన గ్రహం మనం చేసే పనులను నిర్దేశిస్తుందని జ్యోతిషం చెబుతున్నది. తెల్లవారుజామున బ్రాహ్మీముహూర్తంపై ఏ గ్రహాల ప్రభావమూ ఉండదు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు సైతం అతీతమైన సర్వ చైతన్యమయమైన అమ్మవారి శక్తిమాత్రమే ఈ కాలంలో ప్రభావవంతంగా ఉంటుంది. ఆ శక్తికి రూప గుణాలు ఉండవు. అది శుద్ధ చైతన్యం. కేవలం జ్ఞాన స్వరూపం. అందుకే తెల్లవారుజామున నేర్చుకున్న విద్య హృదయానికి హత్తుకుంటుంది. బాగా జ్ఞాపకం ఉంటుంది. ఏకాగ్రత కుదురుతుంది. వాక్‌శుద్ధి కలుగుతుంది. అందుకే, చదువుకు, జపసాధనలకు బ్రాహ్మీముహూర్తాన్ని మించింది లేదని పెద్దలు చెబుతుంటారు.

• శ్రీ



సందర్భం

అమ్మ రంగు పసుపు
అమ్మ కట్టుకున్న వస్త్రం పసుపు
అమ్మ వెలసిన కొలను పసుపు

**పవిత్రతకు మారుపేరైన పసుపు.. లౌకికంగా రోగ నివారిణి. ఆ పసుపు కొమ్ములో కొలువై ఉండే బగలాముఖి కొలిచిన వారికి కొంగు బంగారం. నమ్మిన భక్తులను అమ్మ ప్రశాంత వదనంతో అనుగ్రహిస్తుంది. అరిషడ్వర్గాల మాయలో కొట్టుమిట్టాడుతున్నవాణ్ని తల్లిలా దండించి దారికి తెస్తుంది. అంతర్గత శత్రువులను రూపుమాపి పునీతుణ్ని చేస్తుంది. దశమహావిద్య సాక్షాత్కరించిన ఆదిపరాశక్తి రూపాల్లో బగలాముఖి ఒకటి. దరిద్రాలన్నిటినీ రూపుమాపే హరిద్రహ్రద వాసిని విశేషాలు ఇవి..**

# భక్తానందకరీ.. బగలాముఖి!

కృతయుగంలో ప్రళయం సంభవించింది. ముల్లోకాలూ జల విలయంలో చిక్కుకున్నాయి. ఎటుచూసినా అంధకారం. అంతటా అల్లకల్లోలం. మనుషుల ప్రాణాలమీదికి వచ్చింది. దేవతల అస్తిత్వమే ప్రశ్నార్థకమైంది. ఈ ప్రళయాన్ని నివారించకపోతే సృష్టి ఆదిలోనే అంతమయ్యే ప్రమాదం వాటిల్లింది. ఇంద్రాది దేవతలంతా విష్ణుమూర్తిని వేడుకున్నారు. ఈ విపత్తును చిత్తు చేయగల యుక్తి ఆ పరాశక్తికే ఉందనుకున్నాడు మహావిష్ణువు. సౌరాష్ట్రలో (ప్రస్తుత గుజరాత్) ఒక పసుపు కొలను దగ్గర పరాశక్తి గురించి తపస్సు ఆచరించాడు. విష్ణువు తపస్సుకు మెచ్చిన సృష్టికారిణి ఆ పసుపు కొలనులో పసుపు వర్ణంలో బగలా



ముఖిగా ఆవిర్భవించింది. లోకాలను ముంచెత్తిన ప్రళయ జలాలను లిప్తపాటులో లుప్తం చేసింది. ఉపద్రవాన్ని స్తంభింపజేసిన దేవత కాబట్టి, ఆ పరాదేవిని తంత్రశాస్త్రం స్తంభన దేవతగా స్తుతించింది. అమ్మ అనుగ్రహం బ్రహ్మాస్త్రంలా తిరుగులేనిది. అందుకే, ఆ తల్లిని బ్రహ్మాస్త్ర దేవత అని కూడా పిలుస్తారు.

దేవీ భాగవతాన్ని అనుసరించి దశమహావిద్య ఆవిర్భావ కథ ఆసక్తికరంగా ఉంటుంది. దీని అనుసారం.. దక్షుడు మహాయాగం తలపెడతాడు. ఆదిదంపతులకు ఆహ్వానం అందదు. కానీ, పుట్టింటిపై మమకారంతో తండ్రి చేస్తున్న క్రతువుకు వెళ్తానంటుంది సతీదేవి. ఆలిపై అలిగిన శివుడు ఆమెను కోపగించుకుంటాడు. తన ఇష్టాన్ని కాదన్న రుద్రుడిపై సతీదేవి ఆగ్రహం మిన్నంటుతుంది. భీకర రూపం దాలుస్తుంది. సతీదేవి రౌద్రరూపాన్ని చూసి భయపడి పారిపోబోతాడు శంకరుడు. శివుణ్ని అడ్డుకునేందుకు అమ్మవారు దశమహావిద్యా స్వరూపాలతో (పది రూపాలు) అవతరించింది. అందులో ఒకటి బగలాముఖి.

శాక్తేయంలో బగలా ఉపాసన ప్రత్యేకమైనదిగా చెబుతారు. అమ్మను ఆరాధిస్తే బుద్ధి చేతనం అవుతుంది. సకల సిద్ధులూ కలుగుతాయని నమ్మిక. శత్రువులు నాశనం అవుతారని కూడా పేర్కొంటారు. అయితే, శత్రునాశిని అనగానే ఉగ్ర రూపిణి అనే భావన కలుగుతుంది. బగలాముఖి రూపాన్ని గమనిస్తే.. అసురుడి నాలుకను బయటకు లాగి, దండంతో దండిస్తున్నట్టుగా ఉంటుంది. అకారణంగా ఏ దైవమూ ఎవరినీ శిక్షకు గురిచేయదు. బగలాముఖి.. మనలోని అంతర్ శత్రువులను రూపుమాపే దైవం. శత్రువుల్లో మనపై ఉన్న వైరి భావాన్ని తొలగిస్తుందని భావం. శత్రువులను మిత్రులుగా మారుస్తుందని ఉపాసకులు చెబుతారు. బగలా అమ్మవారి ఆరాధనతో సంకల్పం సిద్ధిస్తుందనీ, మనోబలం కలుగుతుందనీ విశ్వసిస్తారు.

... కణ్వస

### ■ శివాపుర నివాసినీం

**అత్యంత** మహిమాన్వితమైన బగలాముఖి అమ్మవారి శక్తిపీఠం దక్షిణ భారత దేశంలోనే తొట్టతొలిగా తెలంగాణలోని శివంపేట క్షేత్రంలో ఏర్పాటైంది. ప్రముఖ బగలా ఉపాసకులు శాస్త్రుల వేంకటేశ్వర శర్మ నెలకొల్పిన ఈ క్షేత్ర ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 28, 29 తేదీల్లో జరగనుంది. ఈ సందర్భంగా శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారు పసుపు కొలనులో ఆవిర్భవించిందని సాంఖ్యాయన తంత్రం చెబుతున్నది. దానిని అనుసరించి ఇక్కడ దశమహా విద్యలతో కూడిన గర్భాలయం, దాని చుట్టూ కమలం, దానిని అనుసరిస్తూ పసుపు నీళ్ల కందకం ఉండేలా గర్భాలయం నిర్మించారు. పరిపూర్ణ శాక్తధామంగా విరాజిల్లుతున్న పీఠంలో అమ్మవారికి ప్రతి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతీ అమావాస్య, పౌర్ణమి తిథుల్లో విశేష హోమం చేపడుతున్నారు. శక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవానికి అశేష సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి మెదక్ వెళ్లే దారిలో నర్సాపూర్ నుంచి శివంపేట 12 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తూప్రాన్ నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆటోలు, బస్సులు ఉంటాయి.





# పూతనా మోక్షణ లీల.. నిత్యనూతనం!

మేను చెలువం– అందంగా ఉండి మనసు మలినంగా ఉన్న మగువే పూతన. వేదాంత పరంగా స్వరూప జ్ఞాన విస్మృతికి కారణమైన అవిద్య– మాయే పూతన. ఈమెకు రామాయణంలోని తాటకతో పోలిక. రాగద్వేషాలే పూతన స్తనద్వయం. శబ్దస్పర్శరూపరస గంధాలనే విషయ వాసనా– సుఖభ్రాంతే అందలి విషం. అవిద్య– అజ్ఞానం నశించగానే దాని వల్ల కలిగిన అన్ని అనర్థాలు– వికారాలు, వాసనలు అంతమొందుతాయి.



మన పోతన 161 మధురిమ వ భాగం

శుకుడు పరీక్షిత్తుతో.. రాజా! నూతనంగా విచ్చిన జలజాతాల– కమలాల వంటి కన్నులు గల ఆ లీలా బాల వెన్నుడు (విష్ణువు) కేవల విషాన్ని అపథ్యంగా భావించి, పాలు కుడిచే నెపంతో... దేవతలను, మునులను, పసికూనలను యాతనల పాలు చేసిన ఆ పూతన ప్రాణాలను అవలీలగా పానం చేశాడు. ఈ పూతనా మోక్షణ ప్రసంగంలో అనిమిషుని– బాలకృష్ణుని విషపానమనే మిషతో (నెపంతో) పోతన మహాకవి అందించిన, సాహితీ పరుల డెందాలను అలరించే ఈ కింది అందమైన కందపద్యం అతని స్వరంకష– విశేషమైన, కావ్యమనీష (ప్రతిభ)కు నికషోపలం–గీటురాయి.

కం|| 'విషధరరిపు గమనునికిని
విషగళ సఖునికిని, విమల విష శయనునికిన్
విషభవ భవ జనకునికిని
విషకుచ చను విషముఁగొనుట విషమే తలపన్'

శుకుడు.. రాజా! విషసర్పాల దర్పాన్ని హరించే వైనతేయుని– గరుత్మంతునిపై విహరించేవాడు, గరళాన్ని గళంలో అనర్గళంగా నిలుపుకొన్న సర్వమంగళాపతి శర్వునికి (శివునికి) నిత్య సఖుడు, స్వచ్ఛమైన విషం– జలంపై స్వేచ్ఛగా శయనించువాడు. విషముల (నీళ్ల) నుంచి పుట్టిన పద్మంలో ప్రభవించిన పరమేష్ఠి– బ్రహ్మదేవునికి తండ్రి అయిన శ్రీహరికి ఒక దుష్టరాక్షసి చన్నులలోని విషాన్ని హరించడం ఒక పెద్ద విషమ– కష్టమైన విషయమా?

ప్రాణాలు కోల్పోయి నేల కూలిన ఆ పాడు రాకాసి పెన్నురము– విశాల వక్షఃస్థలంపై నిర్భయంగా ఆడుకుంటున్నాడు కన్నయ్య. గోపికలు ఆ చిన్నివాణ్ని ఎత్తుకొని పీడ వదలిపోవడానికి ఆ పాపడి చుట్టూ ఆవు తోక తిప్పారు. కేశవాది నామాలతో లోకేశునికి రక్ష కట్టారు. భావుక భక్తుడు ఇలా చమత్కరిస్తాడు... కన్నతండ్రీ! నీ కన్నా నీ చిన్ని నామంలో ఉన్న శక్తి ఎంతో మిన్న! నీవు మూడు లోకాలనూ రక్షిస్తున్నా నీ నామం నిన్నే కాపాడుతున్నది కదా!

మధుర నుంచి మరలి వచ్చిన నందాదులు నివ్వెరపోయారు. ఆ మాయావి కఠినమైన కాయాన్ని (దేహాన్ని) కుఠారాల (గొడ్డళ్ల)తో ముక్కలు చేసి, చందనపు చెక్కలు పేర్చి దహించారు. రాజా! అక్కజం! ఆ మగువ దేహం రగిలి పొగిలి కాలుతుంటే.. దాని నుంచి అగరు సుగంధాలు వెదజల్లే పొగలు వెలువడ్డాయి. ఎందుకో తెలుసా? బాలముకుందుడు దాని పాలతోపాటు కందువ (సామర్థ్యం)తో దారుణమైన విషాన్ని, ప్రాణాన్నే గాక దేహంలోని కల్మషాన్ని (మాలిన్యాన్ని) కూడా తాగేశాడు. వ్యాసపుత్రుడు శుకుడు ప్రాసంగికంగా భక్తి వైభవాన్ని పునరుక్తిగ పలుకుతున్నాడు...

కం|| 'వెన్నుని కొకమరి విషమగు
చన్నిచ్చిన బాలహంత్రి చనెనంట దివికిన్
వెన్నునిగని పెంచుమదన
చన్నిచ్చిన సతికి మరియు జన్మముగలదే?'

గోపాల బాలునికి ఒక్కమారు విసపు పాలు ఇచ్చిన ఆ పసిపాపల హంతకురాలు తిన్నగా స్వర్గానికి వెళ్లిందట! మరి వెన్నుని కన్నతల్లికి, చన్నిచ్చి పెంచిన తల్లి యశోదకు అపవర్గమే– మోక్షమే కాని మరల రూక్షమైన (పరుషమైన) జన్మ ఉంటుందా?

పూతనా మోక్షణం భగవంతుని వీర్య, ఔదార్యాలను నిరూపించే లీల! పూతన జాతిరీత్యా రక్కసి. చేత రీత్యా బాలఘాతిని. ఆహారమా పసిపిల్లల పచ్చినెత్తురు. కనీసం దాని నీతి– ఉద్దేశమన్నా మంచిదా? అంటే ఇంపైన వేషంతో చంపడానికి వచ్చింది. ఎలా? కాంచన (బంగారు) చాయ కలిగిన కామినిగా! పరమార్థం? ఈ కులమా? ఆ కులమా? అనికాక అనాదిగా అందరి గోకులాన్ని– ఇంద్రియ సమూహాన్నీ వ్యాకుల– క్షోభ పరచేవి రెండే– కామినీ కాంచనాలు! అంతవరకు నేత్రాలు తెరచి చూస్తున్న నవజాత– నూతన శిశువు– బాలకృష్ణుని కన్నులు పూతన రాగానే మూతపడ్డాయి. ఎందుకని? దీనికి వ్యాఖ్యాతలు అనేక హేతువులు ఊహించి, వర్ణించి ఆనందింపజేశారు. 'నా దృష్టి సోకితే అవిద్య నిలువలేదు. అట్టిచో లీలా ప్రదర్శన ఎలా సాగగలదు?' అని కాలరూపుడైన బాలకృష్ణుడు– 'కాలుంగేలు నెరుంగకున్న కరణింగన్మోడ్చి గుర్పెట్టఁగన్'– కాలేదో కేలేదో (చెయ్యేదో) ఎరుగనంతగా నిద్రిస్తున్నట్లు కళ్లు మూసుకున్నాడు! 'తల్లిగా వచ్చినదానిని చూస్తే (మాతృదేవోభవ! అని కదా వేదాజ్ఞ) ఇక చంపలేను. అందువల్ల లీలాసిద్ధి కల్ల కదా!' అని కళ్లు మూశాడు. ఆలి (భార్య) రూపంతో పాలివ్వడానికి వచ్చిన ఈ మూర్ఖురాలిని చూడనని కావాలని కళ్లు మూసుకొన్నాడు. నీలకంఠుని ధ్యానించి, 'స్వామీ! ఫాలాక్షా! నేను పాలు తాగుతాను. నీవు వచ్చి నీ పాలైన– భాగమైన కాలకూట విషాన్ని ఆరగించు' అని అర్థిస్తున్నట్లు బాలకృష్ణుడు కన్నులు మూశాడు. శేష శయనుడు దాది వేషంలో వచ్చిన పూతనను విష రహితంగానే కాక, విషయ రహితంగా కూడా చేశాడు. (రసోవై సః) రసస్వరూపుని ఆశ్రయించిన విషం కూడా రస (అమృత)మయమైంది.

> పూతన దేహం రగిలి పొగిలి కాలుతుంటే.. దాని నుంచి అగరు సుగంధాలు వెదజల్లే పొగలు వెలువడ్డాయి. ఎందుకో తెలుసా? బాలముకుందుడు దాని పాలతోపాటు కందువ (సామర్థ్యం)తో దారుణమైన విషాన్ని, ప్రాణాన్నే గాక దేహంలోని కల్మషాన్ని (మాలిన్యాన్ని) కూడా తాగేశాడు.


పూతన పూర్వజన్మలో బలి చక్రవర్తి తనయ (కుమార్తె) రత్నమాల. యాచనకై యజ్ఞశాలకు వచ్చిన వామన వటువుని చూచి ఆ భామ 'ఇలాంటి తనయుడు తనకుంటే అతనికి పాలిచ్చి నేను ఆనందించగలను గదా' అని పుత్రభావాన్ని పొందింది. భగవంతుడు తన భక్తుని పుత్రిక ఆంతర్యం గ్రహించి, ఆమె మనోరథం ఈడేరు గాక అని అనుగ్రహించాడు. ఆమే ద్వాపర యుగంలో రక్కస కులంలో పూతనగా జన్మించింది. టక్కరి వామనుడు తన తండ్రిని బంధించాడనే అక్కసుతో– అశుభవాసనతో 'మాయా పసికూనను గుక్కెడు విసపు పాలతో చక్కచేస్తా– కడతేరుస్తా' అని చన్నిచ్చి వెన్నుని ప్రసన్నుని గావించి ముక్తి పొందింది. భగవంతుడు భక్తుని అపరాధాలను కన్నెత్తి కూడా చూడడు. ఆయనకెప్పుడూ తన 'భక్తవత్సల' బిరుదే జ్ఞాపకముంటుంది. పూతన మనస్సులో కపటముంది. కపటియే కపటాన్ని కనుగొనగలడు. ఆదిదేవుడు నిష్కపటి. దాదిగా తన వద్దకు వచ్చిన ఆ వెలదిని సవతి తల్లిగా భావించి శ్రీపతి ఆమెకు అతి ఉత్తమగతిని ఇచ్చాడు.

పరమాత్మ... ఇనుమును బంగారంగా మార్చే 'స్పర్శమణి' లాంటివాడు. ఆ మణిని ఖండిస్తాననే– నడ్డి విరుస్తాననే దురుద్దేశంతో బలమైన ఒక ఇనుప కడ్డీ ఆ మణి మీద అడ్డంగా విరుచుకుపడ్డా, తన దివ్య స్పర్శచే ఆ మణి ఇనుప కడ్డీని కూడా బంగారుగా సింగారిస్తుంది కదా! 'ద్వేషాదపి విద్విషాం తథా ప్రాప్తిః'– ఆదిశంకరులు. అలాగే దామోదరునితో ఎవడైనా ద్వేష– వైర మూలకంగానైనా సంబంధం పెట్టుకొంటే దానిని మోదంతో ఆమోదించి వానికి కూడా ముక్తినిస్తాడు ముకుందుడు! (సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

# ప్రతి రోజూ కొత్తే!




ఓ ఊర్లో ఒక పండితుడు ఉండేవాడు. అతను ప్రతి ఆదివారం సమీప గ్రామాలకు వెళ్లి గీతా పారాయణం చేసేవాడు. గ్రామస్థులు దాన్ని ఆసక్తిగా వినేవారు. ఆయన చెప్పే విధానానికి మంత్రముగ్ధులు అయ్యేవారు. ప్రతీ వారం పారాయణానికి వెళ్లడానికి ముందు ఆ పండితుడు భగవద్గీత చదువుకొని మరీ వెళ్లేవాడు. దీన్ని గమనించిన పండితుడి కొడుకు ఓసారి 'ఏండ్లుగా గీతాపారాయణం చెబుతున్నారు కదా నాన్నగారు! ఆ గ్రంథంలో శ్లోకాలన్నీ మీకు కంఠతా వచ్చు కదా! మరి ఎందుకు ప్రతిసారీ పుస్తకాన్ని పరిశీలిస్తారు?' అని ప్రశ్నించాడు. అందుకు పండితుడు నవ్వి 'నాయనా! గీతలో లేని విషయం లేదు. ఎన్నిసార్లు చదివినా ప్రతి శ్లోకం నాకు కొత్త భాష్యాన్ని చెబుతుంది. ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తుంది. ఏదో కొత్త రహస్యం గోచరిస్తుంది. ఈ కారణంగానే గ్రామాలకు వెళ్లిన ప్రతిసారీ చదువుతుంటాను. నేను తెలుసుకున్న విషయాలను గ్రామస్థులకు వివరిస్తుంటాను' అన్నాడు. తండ్రి సమాధానానికి ఆశ్చర్యపోయిన కొడుకు భగవద్గీత చదవడం ఆరంభించాడు. మళ్లీ మళ్లీ చదువుతూ అందులోని లోతు తెలుసుకునే ప్రయత్నం చేశాడు. 'గీత ఒకసారి చదివి వదిలేసే పుస్తకం కాదు! నిరంతరం చదవాల్సిందే. అప్పుడు కానీ జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ ఉద్దేశాన్ని అర్థం చేసుకోలేం' అని తెలుసుకున్నాడు.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

సత్ వాక్యం

**మిత్రాణి ధనధాన్యాని ప్రజానాం సమ్మతానివ**
**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ|**
**అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే**
**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ||**

స్నేహితులు, ధనధాన్యాదులు గౌరవించదగినవే కావచ్చు. కానీ, నాకు జన్మనిచ్చిన తల్లి, నేను జన్మించిన నా జన్మభూమి స్వర్గం కంటే గొప్పవి. బంగారుమయమైన ఈ లంక కూడా ఏ మాత్రం నాకు రుచించడం లేదు. ఎందుకంటే లంకే కాదు, స్వర్గం కన్నా కన్నతల్లి, నేను పుట్టిన నా జన్మభూమి ఉన్నతమైనవి.

(రామాయణంలో రామచంద్రుడు తన తమ్ముడు లక్ష్మణుడితో అన్న మాటలివి)



# కన్నీటి పొరాలు

ఇస్లాం బోధ

గుండె బాధతో బరువెక్కితే కన్నీళ్లు ఆగవు. దుఃఖ పీడితుల కండ్లలోంచి రాలే అశ్రువులు ముత్యాల కన్నా విలువైనవి. రెండు కన్నీటి బిందువుల విలువకు ప్రపంచంలో ఏదీ సరితూగదు. అశ్రువులు మౌన ప్రార్థన అంటారు పెద్దలు. కన్నీళ్లు మాట్లాడుతాయి కానీ, వాటికి భాష లేదు. దీన్ని అల్లాహ్ మాత్రమే వినగలుగుతాడు. దుఃఖంతో పొంగే కన్నీరుతో మనసు తేలికవుతుంది. ఎంత కష్టమున్నా నలుగురిలో ఏడ్వడం కన్నా... ఏకాంతంలో కన్నీళ్లు పెట్టుకోవడం మంచిదంటారు పెద్దలు. తన ప్రేమలో కార్చిన ప్రతి కన్నీటి బొట్టూ అల్లాహ్‌కు ప్రియమైనదని చెబుతారు. మన కన్నీళ్లను మనమే తుడుచుకుంటే దృఢ సంకల్పం అలవడుతుందని పెద్దల మాట. మన కన్నీళ్లను ఎదుటివారు తుడవాలి అనుకోవడం బలహీనతకు నిదర్శనం. మీ గుండె భరించలేని దుఃఖాలు, కష్టాలతో నిండిపోతే, నేత్రాలు కన్నీళ్లతో నిండిపోతే రహస్యంగా ప్రభువుతో మాట్లాడండి. అల్లాహ్‌కు మన కష్టాల గురించి తెలుసు. కానీ, వాటిని మన నుంచి వినాలనుకుంటాడు. అందుకే, కన్నీటి పొరల నుంచి దేవుణ్ని చూడాలంటారు ఉలేమాలు.

పాపభీతితో కార్చే రెండు కన్నీటి బొట్లు అంటే అల్లాహ్‌కు ఎంతో ప్రీతి. చెంపల పైనుంచి జాలువారే ఆ కన్నీరు భగభగమండే నరకాగ్నికీలల్ని చల్లారుస్తుందని ప్రవక్త మహనీయులు చెబుతారు. అల్లాహ్ భీతితో ఎవరైతే కన్నీళ్లు పెట్టుకుంటారో ఆ వ్యక్తిని నరకం నీడ కూడా తాకదని ఆయన సెలవిచ్చారు. మనం చేసే ప్రార్థన అల్లాహ్ స్వీకృతిని పొందింది అనడానికి నిదర్శనం దువా మధ్యలో కన్నీళ్లు రాలడమే! ప్రాపంచిక అవసరాలు తీరలేదని ప్రభువుకు మొరపెట్టుకొని ఏడ్వడంలో గొప్పదనం లేదు. మన కర్మల చిట్టాలో సత్కార్యాలు లేవనే ఆందోళనతో రోదించడమే నిజమైన ఆవేదన. అల్లాహ్ ఆజ్ఞలు భంగపరచినందుకు పడే బాధ పశ్చాత్తాపాన్ని సూచిస్తుంది. అది దైవ ప్రేమకు ఆనవాలుగా నిలుస్తుంది. మనం చేసిన పాపాల వల్ల హృదయానికి తుప్పు పడుతుంది. ఆ తుప్పును వదిలించే గుణం కేవలం పశ్చాత్తాపంతో కూడిన కన్నీళ్లకే ఉందంటారు విశ్వాసులు. మనసును ప్రక్షాళన చేయగలిగిన కన్నీళ్లు ఎంతో విలువైనవి. వాటిని లౌకికమైన విషయాల కోసం కాకుండా... అల్లాహ్ ఆరాధనలో ఖర్చు చేద్దాం.



... ముహమ్మద్ ముజాహిద్
96406 22076